# పతివ్రతల పేర్లు సీతలూ, సావిత్రులూనా?

## డా॥ సత్యకృష్ణ

సంధ్యా సమయం. ఆకాశంలో దట్టమైన మేఘాలు రోజంతా ప్రకాశించి అలిసిపోయిన సూర్యుని మీద దండయాత్ర సాగిస్తున్నాయి. వీస్తున్న చల్లని గాలి రాబోయే వానకి స్వాగత గీతాన్ని ఆలాపిస్తున్నట్లుంది.

సంత చేసుకుని ప్రక్క ఊరినుండి తిరిగి వస్తున్న అప్పన్న వడి వడిగా అడుగులేస్తున్నాడు.

"సందలదేదాకా రెక్కలడిపోయేనాగా పని చేయించుకుని గాని గింజలు కొలిపించడు కాపుగారు. అయ్యట్టుకెళ్ళి సావుకారు కష్మాల. అప్పుడుగాని సంతకెల్లటం పడదు. సంతనాడయినా కొత్త పెంద రాళే వొదిత్తే ఎంత బాగుంటాది?!" అనుకున్నాడు అప్పన్న. కాదు. పైకి అనేశాడు. వినే నాథుడులేక ఆ హోరుగాలినే ఆశ్రయించాయి అప్పన్న పలుకులు. ఇలాంటి మాటలు పాలేరు అప్పన్న కాపుగారి ఎదురుగా అనలేడు. అతని తాత ముత్తాతలంతా పాలేరు పనే చేశారు. ఆ కారణంగా అదే ఇంటిపేరు అయి కూర్చుంది.

"ఇలాటప్పుడు దిట్టంగా వొర్ర ఎక్కవేసి శాపల పులుసెట్టుకు తింటే ఎంత బాగుంటాది!" ఆలోచన వాతావరణానికి అనువైన వంటకాల వైపు మళ్ళింది. అప్పన్న జీవితంలోకి రోజుకి వందసార్లయినా 'ఎంత బాగుంటాది' అన్న ఆలోచన తొంగి చూస్తుంటుంది. అంతటితో ఆగక లేనిదాన్ని ఎత్తి చూపించి మరీ జారుకుంటుంది. "బగమంతుడిరాత" మీద వల్లమాలిన నమ్మకం నరనరాల్లోనూ జీర్ణించుకుపోయిన బాపతు మనిషి అవటం వలన అప్పన్న నిరాశనుంచి ఇట్టే కోలుకుంటాడు. మొండిగా బ్రతికేస్తున్నాడు.

ఒకటి రెండు చినుకులు వొంటిమీద పడ్డాయి. పరుగులాంటి నడక ప్రారంభించేడు.

"తుపాను గాని వొత్తదేమో!" అనుకున్నాడు.

కొద్దినెలల క్రితం వరకు తుఫానంటే ఒక వింత. కాని ఆ మధ్య వారానికొక తుపాను రావటంతో మబ్బుపడితే చాలు, 'తుపా నొత్తదేమో' అనేసుకుంటున్నాడు అప్పన్న. అతననుకున్నట్లు చాలాసార్లు జరగటం వలన అతని జోశ్యం

మీద అతనికి నమ్మకం విపరీతంగా పెరిగిపోతోంది.

"అయిన పదెకరాల పంట ముంగ పేడు తుపానుకు కొట్టుకుపోయిందా. ఇప్పుడు మల్లా కోతకోసి పనులమీద వున్నాది సేనంతా. యిప్పుడుగాని వర్సం మొత్తే సేనంతా మురిగిపోయి పంట నాశనమయిపోద్ది. పాపం కాపుగారు నష్ట పడి పోతారు" తన రెక్కల్ని ప్రతిరోజూ ముక్కలు చేస్తున్న కాపు గారిమీద అప్పన్నకి కోపంలేదు. తన రైతు పంటకి నష్టం వాటిల్లుతుందేమోనని విలవిల్లాడి పోతున్నాడు.

వీలవ్వక గాని ప్రకృతికే అడ్డం నిల బడటానికి సిద్ధపడతాడు అప్పన్న తన రైతుకోసం!!


కాని యిలాంటి వాతావరణానికి కాపు గారు చలించరు. తల్లడిల్లి పోవటానికి అప్పన్న ఉండగా ఆయన చలించిపోవ ల్సిన అగత్యమేముంది!!

ఇంత చక్కని సమయం చిక్కితే చాలు పండుగే ఆయనకి. ఆ క్షణంవరకు పెరట్లో ఆడుకుంటూ తిరుగుతున్న ఒక కోడి కిక ఆయువు మూడినట్లే. అది మరి కొంచెం సేపటికి మాసాలాతో ఐక్యం చెందటం తథ్యం. ఆపైన రెండు పెద్ద సీసాల నాటు సరుకు తప్పక సిద్ధం కావా ల్సిందే. ఆ రాత్రి చిత్తుగా మెక్కి, మత్తుగా తాగి గమ్మత్తయిన మరో ప్రపంచానికి ప్రయాణం ప్రారంభిస్తారు. ఆ మర్నాటి ఉదయం పదిగంటలకు గాని ఆయనకి ఈ ప్రపంచంతో సంబంధ బాంధవ్యాలు ఏర్పడవ్. ఆ ఇంటి "పెద్ద పులి", కాపుగారి తండ్రి అయిన రాఘ వయ్యగారు చనిపోయిన నాటినుంచీ ఇదే వరస.

"సీతాలు ఈపాటికి కూడొండేసి నా కోసం కాసుక్కూకు నుంటాది. అబ్బ! దాని ఆలోశనొత్తే శాన ఇక మతిమతిలో వుండదేటి? పేమంటే ఇదే కామోసు. ఆ మద్దెన సూసిన సినేమాలో పేమంటే ఏదోనని శానా పెద్ద పెద్ద మాటల్లో సెప్పేడు ఈరో. నా కయ్యన్నీ అరదం అవ్వనేదు. నా కోసం అది. దాని కోసం నేను పడి సావటమే పేమనిపిత్తాది నాకు. అది గనక నేకపోతే బతకలేననిపించ టమే పేమ కామోసు. మరి అది రైస్టో కాదో తెలవదు నాకు........" చినుకుల వాన పెరిగి జడివానగా మారి అప్పన్న మనసుని బలనంతంగా ఈ లోకానికి లాక్కొచ్చి పారేసింది. పాపం! ప్రేమ గురించి యింకా ఎన్ని నిర్వచనాలు చెప్పేసునో అప్పన్న! వర్షం మహా చెడ్డపని చేసింది. అతని ఆవేశాన్ని అర్థాం తరంగా త్రుంచేసింది.

నెత్తి మీదవున్న బుట్టలోంచి ఒక పొట్లం తీసి బనియన్ జేబులో భద్రంగా పెటుకున్నాడు అప్పన్న. ప్రతివారం సంతనాడు పదిపైసలు పెట్టి సీతాలి కిష్ట మయిన నువ్వుపప్పు జీళ్ళు కొంటాడు. "ఈటిలాగా తియ్యగా, కమ్మగా ఉండాలి మన సంసారం" అంటూ ఆ రాత్రి సీతా లికి ప్రేమగా తినిపిస్తాడు, ఇది ప్రతివారం అతనికి అలవాటు.

"తడిసిపోయి పాకం కారిపోతే సీతా లికి యిట్టమవదు, అయినా యింకా రుసే స్తుంటాది. తడి తే?" అనుకున్నాడు. జీళ్లు భద్రపడిన తరువాత కొంత మనసు




నెమ్మదిపకంది అప్పన్నకి.

చీకటి చిక్కబడింది. పోటీగా వర్షం పెరిగింది. గాలి తనేమీ తక్కువకాదని నిరూపించుకున్నది. ఫలితంగా అప్పన్న నడక ఆపవలసి వచ్చింది. తన వూరి పొలిమేరవరకు చేరిన అప్పన్నకి పాడు బడిన దేవాలయం కనిపించింది.

గుడిమండపంలో నిలబడ్డాడుఅప్పన్న. నెత్తిమీదవున్న బుట దింపుకుని క్రింద పెట్టాడు. చుట్టూ పరిసరాలని పరికించి చూశాడు. చిమ్మచీకటి. నిర్మానుష్యం కలిసి దివ్యంగా కాపురం చేస్తున్నాయి అక్కడ।

"పాడుబడిన గుడిలో బగవంతు డుంటాడా?" అనుమానం వొచ్చింది అప్పన్నకి.

"ఆ మాటకొత్తే అసలు బగవంతుడనేవో డున్నాడా?" అతని అంతరాత్మ వినిపించనంత నెమ్మదిగా పిరికిగా ప్రశ్నించింది.

"వూళ్ళోవున్న గుడికి ఏటా రంగు లేత్తారు, దేవుణ్ని సోకుసేత్తారు. పెతి ఏటా ఒకపారి పెల్లిసేత్తారు. పూజలు సేసి పదిరకాల పిండివంట లెడతారు గందా. రదమెక్కించి వూరేగిత్తారు గందా. మరి ఈ బాగమంతుడ్ని ఇనాగ యిడిసిపెట్టేసి నారేంది? దేవుళ్ళకాడ కూడ పచ్చపాతపు బుద్దే నేటి ఈ మడుసులికి?"

అప్పన్నలో ఓ చిన్న వేదాంతి, ఓ చిన్న విప్లవవాది కలిసి కాపురం చేస్తున్నారు. పాపం! యిద్దరూ చదువుకోని వారే। యిద్దరూ మూగవారే!। అందుకే అప్పన్న పాలేరుగా వుండిపోయాడు.

చలి పెరిగింది.

మొదట మంటపం దొరికినందుకు

ఎంతో సంతోషించిన అప్పన్న, అంత కంటే వెచ్చని ప్రదేశం దొరికితే బావుండు ననుకున్నాడు. ఇదేమీ విపరీత లక్షణం కాదు. దొరికిన దానికన్నా ఇంకా ఇంకా సుఖాన్ని ఆశించటం అసలైన సిసలైన మానవ లక్షణాల్లో అతి ముఖ్యమైనది!

అప్పన్న దృష్టి గర్భగుడిమీద పడింది. అంతలోనే లెంపలేసుకున్నాడు.

"అపశారం, అపశారం" అనుకుంటూ ఆ ఆలోచన్ని విరమించుకున్నాడు.

"వాన తగ్గదు కామోసు." విసుక్కున్నాడు.

అంతలో గర్భగుడిలోంచి ఆడమగ గొంతులు వినిపించాయి అప్పన్నకి విస్తుపోయాడు.

"ఈవానేంటి ఇలా తగులుగున్నాది?" ఆడగొంతు.

"ఎటూ కాకుండా యిక్కడ చిక్కడిపోయాం మనం" మగగొంతు.

"ఎవరీ ఎదవనాయాళ్ళు. యింతకన్నా సోటు దొరకనేదు కామోసు ఈళ్ళకి. ఈ తొత్తుపనికి బగమంతుడి గర్భగుడే కుదిరిందేటి? పౌరలు కమ్మేసినాయి ఎదవలకి. నుపిసిజలమ ఎత్తలేదేటి? సిత్త కారితి కుక్కలు ముందూ ఎనకా సూసుకోవు. అలా గున్నాది ఈళ్ళ యవ్వారం సూతే. ఎక్కడో ఏడవక యిలాటిసోట ఏంటే తప్పుడు పనులు?" అప్పన్న మనసులో విపరీతంగా మండిపడ్డాడు.

'చెడు వినకు. చెడుమాట్లాడకు, చెడు చేయకు' అనసూక్తి విననివారుండరు. కాని పాటించగల్గినవారు బహు అరుదు. అందుకే మనుష్యుల్లో సామాన్యులెక్కువ. అప్పన్న కూడా సామాన్యుడే కాబట్టి ఆ స్థలంనుంచి పారిపోలేదు. ఆ ఆడ, మగల సంభాషణ వింటున్నాడు.

"అబ్బ! ఏంటా మోటుసరసం? ఆనక మా మావ 'ఏటి మొగమలా కంది పోనాది' అంటే ఏటి సెప్పాలి?' ఆడ గొంతు ఆందోళన.

"ఏదో చెప్పేసెయ్." మగగొంతు నిర్లక్ష్యం.

"మగలంజ కొడుకు వనిపించుకున్నావ్ గందరా! అవుసరం తీరిపోతే శాలు! ఆనక ఇసయాలకి నీకు సంబంధం లేదు కామోసు! నువ్వుచేసిన ఎదవపనికి అది ఏదో సెప్పి సెరిచెయ్యాలా? ఎదవనంజెకొడకా." అప్పన్న ఆవేశంలో ఈ మాటల్ని చిన్నగా పైకి అనేశాడు.


అప్పన్న చెవులు రిక్కించి వింటున్నాడు. ఈసారి మరీ సామాన్యుడయిపోయాడన్న మాట!!

"కాపుగారూ! దేవుడిగుళ్ళో తప్పుపని సేత్తన్నంగందా. ఆడు సూడ్డా -" ఆడ గొంతుకొక్క అనుమానం.

"ఒసే పిచ్చిదానా! మనం యిగ్రహానికి ఎనకమాల వున్నామే! దేవుడికి ఎలా కనిపిస్తాది? హ-హ-హ-హ-" మగ గొంతు సర్ది చెప్పింది. తన తెలివికి తనే మురిసి పోయింది.

ఈసారి మగగొంతును అప్పన్న గుర్తుపట్టేడు, అది తన కాపుగారిదే.

"ఈ కాపుగారు దేవుడి గుడినికూడా పాడుసేయాల కాబోలు." యజమాని మీద కోసం వచ్చింది అప్పన్నకి— కుందేలికి సింహాన్ని చంపేసి తినేయాలన్నంత కోపం వచ్చినట్లు: చైనాలో ఓ




పౌరుషానికి ఆ దేశం ప్రధానిమీద వల్ల మాలిన ఆగ్రహం కనగినట్లు।

"బగమ తుడి" కళ్ళకి కనిపించని దేదీ వుండదని తన కాపుగారికి తెలియనందుకు తన రైతు తరఫున అప్పన్న సిగ్గు పడ్డాడు।

"మా మావ సంతనించొచ్చే ఏలయినాది బాబుగారూ। నే ఎల్లాల." ఆడ గొంతు ఆవేదన.

ఆ గొంతు బాగా పరిచయమున్నదే అనిపించింది అప్పన్నకి.

"వానలో తడుస్తా వెళ్తావటే సీతాలూ। అయినా ఆదేటి సుక పెడతాదే నిన్ను। అప్పన్నగాదే అంత మగాడయితే రెండు సార్లు పెళ్ళాం రెండు కొడిలేస్తారే ఆడ్ని।। నిన్నాడికి కట్టబెట్టిందెందుకో తెలుసా? నా కోసం నువ్వు వూళ్ళో పడుంటావని గాని, ఆడికి సతీ అనసూయలాంటి యిల్లాలి వవుతావని గాదు. యింతకీ...." అప్పన్నకి ఆ తర్వాత వినిపించలేదు.

కాలి క్రింద భూమి అమాంతం తల్లక్రిందులైనట్లు అనిపించింది. పరుగు పరుగున యిల్లు చేరాడు.

తల్లి గుడ్డి దీపం కాంతిలో స్తంభాని కానుకుని కూర్చున్నది.

"కొత్త వాన తగ్గేదాకా ఏడన్నా తల దాచుకుంటే కాదా? అలా తడిత్తే మూలన పడతావుగందరా. సరేగాని సంత బట్ట ఏదిరా అప్పన్నా?" ముసలి తల్లి ప్రశ్నకి సమాధానం చెప్పలేదు అప్పన్న.

"కూడెడతాను కొత్త పొడి బట్ట వేసుకోరా నాయనా."

"నువ్వు నోరు మూసుకుని తొంగోయే. నన్నిసిగించకు మల్లా మల్లా సెప్పి." తల్లిని విదిలించేశాడు అప్పన్న. పాపం ముసల్ది మరి మాట్లాడలేదు. చిన్నబుచ్చుకుంది.

ఇంట్లోలేని సీతాలు ఎక్కడుందో తల్లికంటే తనకే బాగా తెలుసు కనుక ఆ

వివరాలు గురించి తల్లినిక ప్రశ్నించలేదు అప్పన్న.

తడి బట్టలతోనే నులక మంచంలో వెల్లకిలా పడుకున్నాడు. హృదయంలో రగులుతున్న మంటల వేడి వలన అత నికి చలి అనిపించటం లేదు. గతాన్ని త్రవ్వాలని అతను ప్రయత్నించలేదు. అయినాసరే అది అతని కళ్ళముందు కదిలింది.

* * *

"పాలేరు అప్పన్న పెళ్ళం పారోతి లేసి పోయిందట" వూరంతా ముక్కు మీద ఏలేసుకుంది – వూరు కడుపులో దాక్కున్న కుళ్ళును మర్సిపోయి. అంతా సీతి పరులే అని అనేసుకుని! కొందరు "పాపం" అన్నారు. కొందరు సేతగా నోడని ఎగతాళిసేసి నవ్వారు.

పారోతి కాపురాని కొచ్చిన ఏడాదికి ఎవళ్ళతోనోలేసి ఎల్లిపోయింది. తను బాగానే సూసుకునేవాడు. అయినా ఎందుకో మరి అన్నేయం సేసింది. మరో ఆడదాన్ని తను కన్నెత్తి సూసేవోడు కాదు. అయినా పరువు తీసింది. లేసిపోయినదాని మొగుడిగా మిగిల్సి పోనాది తనని. ఎవళ్ళతో లేసి పోనాదో ఎవరికీ తెలియదు.

కొన్నాళ్ళు దొర్లిపోనాయి. కాల శక్తం ఎదరకిపోక ఓ సోట ఆగి పోద్దేటి మరి?

"యిక పెల్లీ పెటాకులూ నేకుండా యినాగే వుండిపోతా వేటిరా అప్పన్నా? నేనే పెల్ల కాలం వుంటానేటి? ఆడదిక్కొద్దేటి కొంపన్నాక? నా మాటయిన్రా! నేనెన్నాళ్లుంటా సెప్పు?" అమ్మ గెడ్డమట్టుకుని బతిమాలింది తనని. తను కరగలేదు.

"నా కూడు నేనొండుకు తింటాన్లేవే అమ్మా! నన్నూరికే బలవంత పెట్టమాకు. నాకు పెల్లిమీద యిట్టం పోనాదే" అన్నాడు తను.

"అబ్బాయా! ఆడోళ్ళంతా ఒకనాగే వుంటారేటి నీ పిచ్చిగాని. పెపంచకం అన్నాక నుంచీ వుంటాది, సెడూ వుంటాది. ఆపాడు ముండని తల్సుకుని బతుకంతా బుగ్గిపాలు సేసుకుంటా వేట్రా? నీ సిన్నప్పుడే మీ అయ్య సచ్చిపోతే నీ కోసం బతికాను గందా నన్నిట్టా ఏడిపిత్తా వెందుకురా?........" అమ్మ కల్లమ్మటా తడెట్టుకున్నాది.

"నీ యిట్ట పెకారమే సెయ్యవే." అన్నాడు తను. అమ్మ కంటితడి తనని కరిగించింది. నెలరోజులు తిరక్కుండానే సరస్వతి కాపరాని కొచ్చింది.

ఎంతయినా పెద్దోళ్ళ మాట సద్దిమూటే అమ్మ సెప్పింది ముమ్మాటికీ నిజం. తను, సరస్వతి సిలకా గోరింకలనాగా కాపరం సేసేవోరు.అంతలో అదినీళ్ళోసుకుంది. అమ్మ సంతోసించింది.

తన మగసిరినే అనుమానించిన పెజల ముందు తను తలెత్తుకు తిరిగాడు. తను తొరలో ఓ బాబుకి బాబు కాబోతున్నందుకు తెగ సంతోసించాడు.

బగమంతుడు మా సెడ్డ తిరకాసు మడిసి. ఎక్కువనాళ్ళు ఎవళ్ళనీ సుగపడనియ్యడు కామోసు!

"నేనెల్లిపోతన్నాను" అంది సరస్వతి ఓరోజు

"ఏడకి? ఎప్పుడొత్తవ్ తిరిగి?" అన్నాడు తను.

"ఏమో నాకు తెల్యదు. తిరిగి మల్లా రాను"

సరస్వతి సెప్పేది తనకు అంతుపట్ట నేదు.

"అంటే ఏటే?"

"నిన్నొగ్గేత్తన్నాను." అన్నాది. సెంపమీద ఛెళ్ళున కొట్టాడతను.

తన బట్టల మూట తీసికొని ఎల్లిపో యింది. తను బతిమాలలేదు. ఆపలేదు. 'పోరా' అన్న ఆడదాన్ని పట్టుకుని, ఏలా దానికి తనింకా సిగ్గు వొగ్గియనేదు.

శాన్నాళ్ళకి తెల్సినాది. ఆళ్ళూళ్ళో పెళ్ళికి ముందర ఓ సినేమా గేటోడితో దానికి సంబంధం వుండేదంట. ఆమద్దె నోసారొచ్చి 'సిన్నాలో యిద్దరం ఏసా లేద్దాం పట్నంపోయి. వచ్చేయ్' అన్నా డంట అదెల్లిపోయింది.

'ఎదవనాయాల్ది' అనుకుని దాని వూసు మర్సిపోయాడు తను.

ఆ తర్వాత ఆడదంటే సాలు నమ్మ కూడదను కున్నాడు. అంతా సెడ్డనాయా ళ్ళనేసుకున్నాడు. కాని అమ్మలాటోళ్ళు పూజారిగారి యింటావిడ లాటోళ్ళు గురుతొచ్చి లెంపలేసుకున్నాడు. అందర్నీ కలిపేసి అంటే పాపం సుట్టుకుంటాది అనుకున్నాడు తను.

పెల్లిమాట పూర్తిగా మర్సిపోయి బతుకుతున్నాడు తను. ఓ రోజు తనకి బాగా గుర్తు. కాపుగారికి గొబ్బిరి బోం దాలు సెక్కి పెడతన్నాడు తను.

"ఏరా అప్పన్నా! యిక సంసా రం, గింసారం లేకుండా యిట్టాగే సన్నా సిలా వుండి పోతావా?" కాపుగారి మాట లకి తను సమాధానం యియ్యలేదు.

"మాట్లాడవేంరా?" రెట్టించారు కాపు గారు.

"ఎందుకుబాబూ? ఈపాటి సుగం కూడా కరువై పోతాది." ఈసారి తను సమాధానం సెప్పక తప్పనేదు.

"అదేం వైరాగ్యంరా నిండాముప్పయి ఏళ్ళయినా రానిదే! యిప్పుడు బాగానే వుంటాది. ఆనక కాస్త వయసుడిగాక కాలొంగక పోయినా, చెయ్యొంగక పోయినా కొంచెం ఆసరా కావద్దూ? ఓ సంగతి చెప్తా విను. అసలు మగాడికి ఆడ దాని వుపయోగం వయసు మళ్ళేకనే! ఆ ఎదవ ముండెల్లిపోతే నీకేరా? మరో మను వాడు. మగమహారాజువి!" ఆయనన్న యిసయాల్లో సగం తనకరదం అవ్వ నేదు.

"ఓరేయ్! నేనొక మాట చెప్తా విను. మీ అమ్మ బాగా ముసల్దయి పోయింది. నువ్వా ఒక్కబిడ్డవే. నిన్న నాదగ్గరకొచ్చి తెగ గోలపెట్టింది. కన్నందుకు దాన్నలా హింసపెట్టకురా! బైటవూరి పిల్లలయితే వాళ్ళ గుణగణాల గురించి వివరాలు మన. కంతగా తెలియవు పోనీ మన తోటమాలి మనవరాలుందిగా—సీతాలు! పిల్ల మంచిది. దాన్ని కట్టుకో. ఆ ముసలాడు పోయాక ఆయిల్లు నీకే వస్తుంది. పాపం ఆ ముస ల్దాన్ని ఏడిపించకురా! నామాటకాదనకు" ఈసారి అయ్యగారి యిష్టప్రకారం జరి గింది.

సీతాలు శానా మంచిది నిజంగా. బగ మంతుడికి జాలేసి దీన్ని పెసాదించాడని మురిసిపోయాడు తను.

తను పన్లోంచి రావటం ఎంత ఆలస్య మయినా ఎదురు సూత్తా కూకుండేది. అం

దాకా ఎంగిలి పడేది కాదు. అమ్మని శానా యిదిగా సూసుకుందేది. అది కావాల, యిది కావాల అని ఎప్పుడు పోరదు తనని.

ఎప్పుడు యిసిగించదు. మనసెరిగి నడుసుకుంటాది. రోజూ పొలంనించి సంపంగి పూలు తెత్తాడు తను. తెగ యిదయి పోద్ది అపాటికే.

తనకి వూళ్ళోవోళ్ళంతా "యిసుగు చెందని యిక్రమార్కుడని" పేరెట్టారు. వోపిగ్గా కాపురాలు మారుత్తున్నానంట. ఓ పెళ్ళాం వదిలేసి ఎళ్ళిపోతే మల్లా మనువాడి అదీ ఎల్లిపోతే మల్లా మనువాడి యిసుగు లేకుండా గడుపు కొత్తన్నానంట తన ఎనక ఎంతమంది నవ్వినా సీతాలు కనపడితేశాన ఆబాదంతా పోతది. "కాపుగారు శానా మంచోరు. అందుకే సీతాల్ని తనకి కట్ట బెట్టేరు." అనుకున్నాడు తను

ఏదో అలికిడి అయ్యింది.

అప్పన్న గతంలోంచి ప్రస్తుతంలోకి వచ్చాడు.

• • •

తడిక తలుపు తోసుకుని గుడిసె లోపలికి వచ్చింది సీతాలు. బట్టలన్నీ తడిచి పోయాయి.

సగం మూసినకళ్ళతో అంతా చూస్తున్నాడు అప్పన్న.

బట్టలు మార్చుకుంది. చాప పరచుకొని పడుకుంది.

తన జీవితంతో క్రూరంగా ఆటలాడుతున్న నీతిమాలిన కులటలందరికీ పతివ్రతల పేర్లుండడం, దేవతల పేర్లుండటం విడ్డూరంగా తోచింది అప్పన్నకి.

స్వార్థంతో సీతాల్ని తనకు కట్టబెట్టిన కాపుగార్ని ఏంచేసినా పాపం లేదనిపించింది అప్పన్నకి.

"దానివలన నా బాద పోద్దేటి? దానికి ఏదో వుపాయం కని పెట్టాల గాని!" అనుకున్నాడు.

అప్పన్న బుర్ర పనిచేయటం మానుకుంది. చాలాసేపు తల్లి వైపు, సీతాలివైపు మార్చి మార్చి చూశాడు.

తొలి కోడి కూసింది. అప్పన్న పెద్ద నిట్టూర్పు విడిచాడు. ఒక్కోరకం చూపుకి ఒక్కోరకంఅర్థంవున్నట్లే నిట్టూర్పులలో కూడాచాలా రకాలున్నాయి. అప్పన్న విడిచిన నిట్టూర్పులోని నిగూఢార్థం అతని కొక్కడికే తెల్సు.

నెమ్మదిగా మంచంలోంచి లేచాడు. తడిక తలుపు తెరచుకుని బయటకు నడిచాడు.

వూరి కుక్కలు మొరుగుతూ వెనక పడ్డాయి. అతనికేదో గురుతొచ్చింది. జేబులోంచి జీళ్ళ పొట్లం తీసి వాటికి విసిరాడు. అవి అంతటితో శాంతించాయి.

అప్పన్న గమ్యంలేని ప్రయాణాన్ని ప్రారంభించేడు నిశీధిలోకి పారిపోయాడు. ఆ తర్వాతయినా అప్పన్న బ్రతుకులో ఓ మంచి మలుపొస్తే" ఎంత బాగుంటాది.

●